సాక్షి
పార్వతీపురం మన్యం
గురువారం । 17 । ఏప్రిల్ । 2025



అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన అవసరం - 8లో

అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పించారు.



ఏఆర్ కానిస్టేబుల్ పేరిట వాలీబాల్ టోర్నమెంట్ - 8లో

పోలీస్ బ్యారెక్స్‌లో ఏఆర్ కానిస్టేబుల్ పేరిట వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది.

20న ప్రవేశ పరీక్ష

కొమరాడ: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకులాల్లో 5, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీల భర్తీకి ఈ నెల 20 తేదీన ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహిస్తామని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల పిన్సిపాల్ డి.లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రానికి ఉదయం 10 గంటలకే చేరుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

న్యూస్‌రీల్

చక్కెర ఫ్యాక్టరీలపై ఏదీ చర్చ!

- చంద్రబాబు కేబినెట్‌లో ప్రస్తావన లేకపోవడం బాధాకరం
- హామీ ఇచ్చి మర్చిపోవడంపై ఆందోళన



మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: రాష్ట్రంలో మూతపడిన సహకార చక్కెర ఫ్యాక్టరీలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సాగిన కేబినెట్ సమావేశంలో కనీసం చర్చించకపోవడం విచారకరమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్రలోని తాండవ, ఏటికొప్పాక, అనకాపల్లి, భీమసింగి చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు, యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ శాసనసభ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు హామీ ఇచ్చి మర్చిపోవడం తగదన్నారు. 2025–26 సంవత్సరంలోనైనా ఫ్యాక్టరీలు తెరిపించి క్రషింగ్ జరిగేలా చూడవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మూతపడిన ఫ్యాక్టరీల కార్మికులు, ఉద్యోగులు, రైతు బకాయిలు సుమారు రూ.33 కోట్లు ఉన్నాయని, చాలామంది కార్మికులు ఆందోళనతో చనిపోయారన్నారు. ఇప్పలవలస గోపాలరావు, తుమ్మగంటి రామ్మోహనరావు పాల్గొన్నారు.

రైల్వే మూడోలైన్ పనుల పరిశీలన

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని గరివిడి, దువ్వాం, తోండ్రంగి, కొండలక్ష్మీపురం, కొండశంబాం, చుక్కవలస గ్రామాల మీదుగా రైల్వే మూడోలైన్ ఏర్పాటుకు అవసరమైన భూములను జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ బుధవారం పరిశీలించారు. రైల్వేలైన్ ఏర్పాటులో అడ్డంకులపై రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురం రైల్వే గేటు వద్ద ఏర్పాటు చేయనున్న రైల్వే వంతెన(ఆర్‌ఓబీ) వల్ల ఎదురయ్యే సమస్యలపై గ్రామస్తులు ఇటీవల జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆర్‌ఓబీ నిర్మాణంతో గ్రామానికి, గ్రామంలో ఉండే ఇళ్లకు ఎంతవరకు నష్టం జరగనుందన్న అంశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బి.సురేష్, మండల సర్వేయర్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్‌తో నాణ్యమైన విద్యుత్

విజయనగరం ఫోర్ట్: కేంద్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో సూర్యఘర్ యూనిట్లు ఏర్పాటుచేయాలని, నాణ్యమైన విద్యుత్ సదుపాయం కల్పించేందుకు అధికారులు చొరవ చూపాలని ఎంపీ, విద్యుత్ కమిటీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో నెలకు కనీసం మూడువేల సూర్యఘర్ యూనిట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సూర్యఘర్ పలకల ఏర్పాటుకు స్థలాలు లేనిచోట పంచాయతీరాజ్ చెరువు గట్లను వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో కలెక్టర్ అంబేడ్కర్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఎం.లక్ష్మణరావు, ఈఈలు హరి, త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

పో.. పొండి...
మీ ఊళ్ల సమస్యలు మాకెందుకు!




సీతంపేట గిరిజన గ్రామం

- జిల్లా కేంద్రంలో ఉన్నా సరే.. విసిరేసినట్లు ఉండే గిరిజన గ్రామాలు
- కనీస సౌకర్యాలకు నోచుకోని తాన్నవలస, తొక్కుడవలస, సీతంపేట గిరిజనులు
- రహదారికీ నోచుకోని అభాగ్యులు

కొండకోనల్లో నాలుగు దశాబ్దాలుగా నివసిస్తున్న ఊరు వారిది కాదని, తక్షణమే ఖాళీచేయాలంటూ హుకుం జారీచేస్తున్నవారు కొందరు... ఏళ్ల తరబడి బురదనీరు తాగుతున్నామని, ఆరోగ్యం క్షీణించి గ్రామస్తులు మరణిస్తున్నారని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటే.. 'కొబ్బరి నీళ్ల కావాలా' అంటూ వెటకారం చేసేవారు మరికొందరు... సాగుభూమికి పట్టాలు ఇవ్వాలని ప్రాథేయపడినా కనికరించని అధికారులు... గ్రామం పక్కనే మైనింగ్ తవ్వకాలకు మాత్రం ఆగమేఘాలమీద అనుమతులు మంజూరు చేసిన పరిస్థితి మరోవైపు.. ఇలా.. ఆ గిరిజన గ్రామాలకు వెళ్తే కన్నీటి వ్యథలు, గిరిజనుల కష్టాల జీవనం, సమస్యలే సాక్షాత్కరిస్తాయి.

– సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం రూరల్

కింది చిత్రంలో రెండు దృశ్యాలను చూశారా.. ఒకటి పార్వతీపురం మండలం గంగాపురం పంచాయతీ తాన్నవలస గిరిజన గ్రామం. ఇక్కడే పక్కన కనిపిస్తోన్నది.. కోరి రెవెన్యూ పరిధిలోని బడిదేవరకొండపై వైట్ స్టోన్ మైనింగ్ తవ్వకాలకు అనుమతి. కోరి రెవెన్యూ పరిధిలోని 1–1 సర్వే నంబరులో 582 ఎకరాలుంది. గిరిజనులకు సబ్ డివిజన్ చేసి పట్టాలివ్వాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. 82 ఎకరాలకు అసైన్‌మెంట్ కాపీలు సర్వే చేసి ఇచ్చారు. పట్టాల ఊసు లేదు. ఇదే సమయంలో మైనింగ్‌కు ఆగమేఘాల మీద 16 హెక్టార్లు చేసి ఇవ్వడం అధికారుల పనితీరుకు తార్కాణం. గిరిజనుల పట్ల పాలకులకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.



ఎడమవైపు తాన్నవలస గిరిజన గ్రామం.. కుడివైపు బడిదేవరకొండపై మైనింగ్ తవ్వకాలు



పై చిత్రంలో కనిపిస్తున్నది పార్వతీపురం జిల్లా కేంద్రానికి కూతవేటు దూరం సంగంవలస పంచాయతీ పరిధిలోని సీతంపేట గిరిజన గ్రామం. ఇక్కడ సుమారు 40 గిరిజన కుటుంబాలు దాదాపు నాలుగు దశాబ్దాలుగా పిల్లాపాపలతో నివసిస్తున్నారు. ఎన్నడూ లేని కష్టం ఇటీవల వీరికి వచ్చిపడింది. కొంతమంది వచ్చి.. ఇవి తమ భూములని, ఇక్కడున్న ఇళ్లు ఖాళీ చేయాలని హుకుం జారీ చేశారు. నోటీసులు కూడా పంపారు. వాటిని పట్టుకుని రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్తే.. అక్కడ సిబ్బంది తెల్ల కాగితం మీద సంతకం/వేలిముద్ర వేయాలని చెప్పడంతో తెల్లబోవడం ఆ గిరిజనుల వంతైంది.

ఇక్కడున్న బోరు ద్వారా మూడు, నాలుగు బిందెలు నీటిని తోడితే వచ్చేది బురద నీరే. ఈ నీటి ప్రభావమో ఏమో గానీ.. చిన్న వయసులోనే తొక్కుడవలస గ్రామంలో మరణాలు సంభవిస్తున్నాయి. మెల్లిక చిన్నమ్మి, చోడిపల్లి లలిత, కేంద్రిక డంగు, కేంద్రిక వలసమ్మ, చోడిపల్లి చెల్లమ్మ, చోడిపల్లి చుక్కయ్య.. ఇలా అనేక మంది అర్ధాయుష్షుతో తనువు చాలించిన వారే. జ్వరాలు వచ్చిన రోజుల వ్యవధిలోనే చనిపోతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. బోరును బాగు చేయాలని అధికారులకు మొర పెట్టుకుంటే.. ఇటీవల పరిశీలనకు వచ్చిన ఓ అధికారి 'మీ కోసం కొబ్బరి నీళ్లు తేవాలా?' అంటూ వెటకరించారని గిరిజనులు వాపోయారు.



తొక్కుడవలస గ్రామంలో బురదనీటినే పడుతున్న గ్రామస్తులు



తమకు డీ పట్టా హక్కులు కల్పించాలని కోరుతున్న గిరిజన గ్రామాల ప్రజలు

పార్వతీపురం మండల పరిధిలోని సీతంపేట, తాన్నవలస, తొక్కుడవలస, తొక్కుడవలస కొత్తపాకలు గిరిజన గ్రామాలు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. పేరుకు జిల్లా కేంద్రంలో ఉన్నా సరే.. కనీసం ఈ గ్రామాలకు రహదారి భాగ్యమూ కరవే.

- సంగంవలస నుంచి సీతంపేట గిరిజన గ్రామానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు వేశారు. కాంట్రాక్టర్ వచ్చి మధ్యలో వాల్ కడతామని కొంత తవ్వేసి వెళ్లిపోవడంతో ఇప్పుడు మొత్తం రాళ్లు తేలి, ప్రయాణానికి ఇబ్బందికరంగా ఉందని గిరిజనులు చెబుతున్నారు. దాదాపు 40 ఏళ్లుగా ఇక్కడ గిరిజనులు నివాసం ఉంటున్నా.. కనీసం సీసీ రహదారులు గానీ, డ్రైన్లు గానీ లేవు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటి కుళాయిలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు పనులు చేయకుండా వదిలేశారు. ఇటీవల వీరు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిశారు. ఇప్పుడా పనులను తాము కూడా చేయలేమని వారూ చేతులెత్తేయడంతో.. సొంత ఖర్చులతోనే చేసుకుంటామని, అందుకు అనుమతి ఇవ్వాలని పట్టుబట్టి సాధించుకుని.. గ్రామస్తులు సొంతంగా పనులు చేయించుకుంటున్నారు.
- గతంలో వీరికి గ్రామానికి దూరంగా కొండపోడు భూములకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలిచ్చారు. గ్రామ సమీపంలోనే చాలా వరకు డీ పట్టా భూములున్నాయి. గతంలో అటవీ శాఖ సర్వే చేసి, కొంత భూమిని డీ పట్టా రూపంలో గ్రామస్తులకు ఇవ్వొచ్చని సర్వే నంబర్లు రాసిచ్చారు. ఆ భూమిలో తమకు పట్టాలివ్వాలని చాలా కాలం నుంచి గిరిజనులు కోరుతున్నారు. ఇదే సమయంలో గ్రామంలో సర్వే నంబరు 60–2, 59–1, 60–1, 95–1 తదితర నంబర్లలో కోలక చంద్రయ్య, రామందొర, మువ్వల అప్పలస్వామి పేర్ల మీద మెట్ట, పల్లం ఉన్నట్లు వన్‌బీలు కూడా వస్తున్నాయి. వారితోపాటు, వీరి వారసులు కూడా ప్రస్తుతం ఇక్కడే ఉన్నారు. ఇప్పుడు ఆకస్మాత్తుగా ఈ స్థలాలు, ఇళ్లు ఖాళీ చేయాలని కొంతమంది వచ్చి, ఆక్రమించుకుని వీరికి నోటీసులు ఇస్తుండడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడున్న 40 కుటుంబాల్లో చోడిపల్లి ప్రశాంత్, తాడంగి బాదల్, కొండతామర సోమేశ్, మెల్లిక సింగుడు తదితర 27 కుటుంబాల వారు నోటీసులు అందుకోవడం గమనార్హం.



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు మెల్లిక కురమయ్య. 2023లో ఆయన కుమార్తె చిన్నమ్మి జ్వరంతో మృత్యువాత పడింది. రెండు రోజులపాటు జ్వరం వచ్చిందని.. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్తే, పచ్చకామెర్లు సోకాయని వైద్యులు చెప్పారని, వెంటనే చనిపోయిందని ఆయన కన్నీటిపర్యంతమయ్యాడు. 20 ఏళ్ల వయస్సులోనే కుమార్తెను కోల్పోయానని వాపోయాడు. గ్రామంలో ఇటువంటి మరణ ఘోషలు ఎన్నో ఉన్నాయని.. కలుషిత నీరే ఇందుకు కారణమని ఆవేదన వ్యక్తం చేశాడు.

నోటీసిస్తే.. భయమేసింది!



40 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. ఎవరో వచ్చి, మమ్మల్ని ఖాళీ చేయాలని చెప్పారు. అధికారులకు చెప్పడానికి వెళ్తే మా బాధ విని, న్యాయం చేయాల్సిందిపోయి, తెల్ల కాగితం మీద సంతకం చేయాలని చెప్పారు. భయం వేసింది. ఏదైతే అదే జరగనీ అని అక్కడ నుంచి వచ్చేశాం. ఆధార్ కార్డు, ఓట్లు అన్నీ ఉన్నాయి. అలాంటప్పుడు మేం ఎక్కడికి పోవాలి.

– చోడిపల్లి ప్రశాంత్, సీతంపేట గ్రామం, పార్వతీపురం మండలం

డీ పట్టా భూములివ్వాలని అడుగుతున్నాం..



ఆర్‌వోఎఫ్‌ఆర్ ఇచ్చారు.. గతంలో మా గ్రామానికి దగ్గరనే కొంత భూమిని డీ పట్టా రూపంలో ఇవ్వొచ్చని అటవీ శాఖ వారు సర్వే చేసి చెప్పారు. అవి ఉంటే కదా.. ప్రభుత్వపరంగా ఏ పథకాల లబ్ధి అయినా పొందగలం. ప్రభుత్వం దయతలచి మా సమస్యను పరిష్కరించాలి.

– తాడంగి రాము, సీతంపేట

జగన్ హయాంలో పట్టా ఇచ్చారు..



గత ప్రభుత్వ హయాంలో సాగు హక్కు పత్రం ఇచ్చారు. సబ్ డివిజన్ చేసి వన్‌బీలు ఇవ్వాలని కోరుతున్నాం. అప్పుడే ప్రభుత్వం నుంచి అన్ని ఫలాలూ పొందగలం. ప్రస్తుతం ఏ పథకాలూ అందడం లేదు. పాఠశాల, అంగన్‌వాడీ సేవలు కూడా మాకు అందడం లేదు.

– మెల్లిక బిబ్బిక, తాన్నవలస

బడికి వెళ్లాలన్నా.. మూడు కిలోమీటర్లు నడవాల్సిందే

- గంగాపురం పంచాయతీ తాన్నవలస, తొక్కుడవలస, తొక్కుడవలస కొత్తపాకలు గిరిజన గ్రామాలకు పాఠశాలలు కూడా లేవు. ఇక్కడ చదువుకునే పిల్లలు 30 మంది వరకు ఉన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు చదవాలన్నా.. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోరి, పనసభద్ర గ్రామాలకు వెళ్లాల్సిందే. అంగన్‌వాడీ కేంద్రం కూడా పనసభద్రలోనే ఉంది. అంగన్‌వాడీ సేవలు పొందాలన్నా.. పౌష్టికాహారం తీసుకోవాలన్నా గర్భిణులు, బాలింతలు సైతం మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న కేంద్రానికి నడుచుకుని వెళ్లాలని గిరిజనులు చెబుతున్నారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న డోకిశీల పీహెచ్‌సీకి వెళ్లాల్సిందే.
- తాన్నవలసలో 20 వరకు గిరిజన కుటుంబాలు ఉన్నాయి. కొండ ఊట నీరు ఆధారంగానే పంటలు పండిస్తుంటారు. చెక్‌డ్యామ్ లేకపోవడం వల్ల కొండ నీరు వృథాగా పోతోంది. గ్రామానికి దిగువన ఉన్న స్థలంలో కొండ భూమిపై వీరికి హక్కులు కల్పిస్తూ అసైన్‌మెంట్ కాపీలిచ్చారు. సబ్ డివిజన్ చేసి, వన్‌బీలు ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. అప్పుడే ఐటీడీఏ ఫలాలు అందుతాయని ఆశిస్తున్నారు.
- తొక్కుడవలస గిరిజన గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కలుషిత నీటిని తాగడం వల్ల విష జ్వరాలు, పచ్చకామెర్లతో తరచూ గిరిజనులు మృత్యువాత పడుతున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్నా.. తమ బాగోగులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.



రోడ్డు దిగువ భాగమంతా కోరుకుపోవడంతో ఏ క్షణమైనా కుంగిపోతుందని చెబుతున్న తాన్నవలస గిరిజన గ్రామ ప్రజలు

మూతపడే దిశగా..
సగం సచివాలయాలు

- సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం చేసేందుకు కూటమి కసరత్తు!
- జనాభా ప్రాతిపదికన సచివాలయాల క్లస్టరైజేషన్
- జిల్లాలో ప్రస్తుతం 350 సచివాలయాలు
- క్లస్టరైజేషన్‌లో 175కే పరిమితం
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు

పార్వతీపురంటౌన్:

ఊరు/వార్డు ప్రజలకు ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా విస్తృత సేవలందిస్తూ... దేశంలోనే పేరొందిన ఏపీ గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా కూటమి కసరత్తు ప్రారంభించింది. సచివాలయాల కుదింపునకు రంగం సిద్ధం చేసింది. జనాభా ప్రాతిపదికన సచివాలయాలను ఉంచేందుకు చర్యలు చేపట్టింది. క్లస్టరైజేషన్‌లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రస్తుతం ఉన్న 350 సచివాలయాల్లో సగానికి తగ్గి 175కు పరిమితం కానున్నాయి. సిబ్బందిని కూడా గ్రేడ్‌ల వారీగా సచివాలయాల్లో సర్దుబాటు చేయనున్నారు. ప్రభుత్వ చర్యలతో సచివాలయ సిబ్బంది, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



పార్వతీపురం మండలం తాళ్లబురిడి సచివాలయం

ప్రతిపాదనలు పంపించాం



జిల్లాలోని ఏంపీడీఓ వద్ద నుంచి క్లస్టరైజేషన్‌కు సంబంధించిన వివరాలు సేకరించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ మొదలుపెట్టాం. జిల్లాలో ప్రస్తుతం 350 సచివాలయాలను క్లస్టర్లుగా విభజించాం. ఈ విధానంతో 175 సచివాలయాల వరకు ఉండవచ్చు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ చేపట్టాం.

– రామచంద్రరావు, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి, పార్వతీపురం

జిల్లాలో మండలాల వారీగా క్లస్టరైజేషన్ ఇలా...

మండలం	ప్రస్తుతం సచివాలయాలు	క్లస్టరైజేషన్‌లో మూతపడనున్న సచివాలయాల సంఖ్య
బలిజిపేట	20	10
భామిని	16	8
గరుగుబిల్లి	13	8
గుమ్మలక్ష్మీపురం	24	12
జియ్యమ్మవలస	25	12
కొమరాడ	20	11
కురుపాం	20	10
మక్కువ	17	9
పాచిపెంట	17	8
పాలకొండ రూరల్	22	11
పాలకొండ అర్బన్	9	4
పార్వతీపురం రూరల్	20	10
పార్వతీపురం అర్బన్	15	7
సాలూరు రూరల్	22	11
సాలూరు అర్బన్	14	7
సీతంపేట	31	15
సీతానగరం	21	10
వీరఘట్టం	24	12

తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

విజయనగరం ఫోర్ట్: తల్లీబిడ్డల ఆరోగ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం స్త్రీ, శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల, బాలికల ఆరోగ్యంపై అన్ని శాఖలు దృష్టి సారించాలన్నారు. చక్కని పౌష్టికాహారం అందించడంతో పాటు, వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయాలని, తల్లులకు ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న 69,000 మంది చిన్నారుల్లో 4 వేల మంది బరువు తక్కువగా ఉన్నట్లు నివేదికలు తెలియజేస్తున్నాయని, వారికి పౌష్టికాహారం అందించి ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దాలన్నారు.

అడ్మిషన్ డ్రైవ్ ప్రారంభించాలి

పార్వతీపురం టౌన్: పాఠశాలల్లో అడ్మిషన్ డ్రైవ్ ప్రారంభించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో అడ్మిషన్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల విద్యా, ఆరోగ్య స్థాయిలపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉంటున్న చిన్నారులందరూ ఒకటో తరగతిలో విధిగా చేర్పాలని ఆయన ఆదేశించారు. ఏ ఒక్క విద్యార్థి పాఠశాలలో చేరకుండా ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 19న వీడ్కోలు కార్యక్రమం జరుగుతుందని, 21వ తేదీ నాటికి పిల్లలు అందరూ పాఠశాలల్లో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. గత ఏడాది ఒకటవ తరగతిలో 10,932 మంది చేరారని, అదే స్థాయిలో ఈ ఏడాది కూడా విద్యార్థులు చేరాలన్నారు. జిల్లాలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో 9,200 సీట్లు ఉన్నాయని తెలిపారు.

వయస్సుకు తగిన బరువు, పెరుగుదల ఉండాలి

అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారుల బరువు, పెరుగుదల వయస్సుకు తగ్గట్టుగా ఉండాలని ఐసీడీఎస్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సూపర్‌వైజర్లే సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. గుమ్మ, సీతంపేట ప్రాంతంలో నిర్దేశిత ప్రమాణాల మేరకు చిన్నారుల పెరుగుదల, బరువు ఉండడం లేదని, దీనిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరు చేసిన మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని ఆదేశించారు. పోషణ పక్వాడ కిట్లను పక్కాగా అందించాలని పేర్కొన్నారు.

2 నెలల్లో జనన ధ్రువీకరణ పత్రాలు జారీ

శిశువు జన్మించిన రెండు నెలల్లో జనన ధ్రువీకరణ పత్రాలను సంబంధిత పంచాయతీ కార్యదర్శి జారీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జనన ధ్రువీకరణ పత్రాలు జారీచేయకుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ నిర్వహణ కరపత్రాలను కలెక్టర్ విడుదల చేశారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి డాక్టర్ టి. కనకదుర్గ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి.మంజుల వీణ, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.కృష్ణవేణి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఇ.అప్పన్న, సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్.రాజేశ్వరరావు, సీడీపీఓలు, డిప్యూటీ విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ నిర్వహణ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

క్లుప్తంగా

జిల్లాలో న్యాయ సేవలు సంతృప్తికరం

• జిల్లా జడ్జి సాయి కల్యాణ్ చక్రవర్తి



జిల్లా జడ్జి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

బొబ్బిలి: జిల్లాలో న్యాయమూర్తిగా అందజేసిన సేవలు తనకు సంతృప్తినిచ్చాయని జిల్లా జడ్జి బి.సాయికల్యాణ్ చక్రవర్తి అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక కోర్టులో న్యాయమూర్తులు, న్యాయవాదులు జడ్జి సాయి కల్యాణ్ చక్రవర్తి దంపతులను ఘనంగా సత్కరించారు. శాఖాపరమైన బదిలీలో భాగంగా గుంటూరు జిల్లా జడ్జిగా వెళ్తున్నందున ఆయనను సత్కరించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మోహన్ మురళీ కుమార్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు సీనియర్ న్యాయమూర్తి దామోదర రావు, స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, ఏజేఎఫ్‌సీఎం రోహిణీరావు, న్యాయవాదులు కొల్లి సింహాచలం, ఎం.బెనర్జీ, ఎ.రామకృష్ణ, ఎం.సింహాచలం, డి.లక్ష్మి దీపవల్లి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు సీజ్



ఆర్డీఓ సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామం వద్ద వేగావతి నదిలో ఇసుకను తవ్వి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆర్డీఓ జేవీవీ రామ్మోహనరావు బుధవారం సీజ్ చేశారు. బొబ్బిలి నుంచి విజయనగరం వెళ్తున్న ఆయన వేగావతి నదిలో ఇసుకను లోడ్ చేస్తుండగా గమనించి ట్రాక్టర్ డ్రైవర్లను తవ్వకాలపై ప్రశ్నించారు. ఎక్కడికి తరలిస్తున్నారని ,అనుమతులు, పర్మిట్లు ఉన్నాయా అని ఆరాతీసిన ఆర్డీఓకు అవేమీ లేవని బొబ్బిలికి తరలిస్తున్నామని డ్రైవర్లు తెలపగా వెంటనే రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేయాలని తహసీల్దార్ శ్రీనుకు ఆర్డీఓ ఆదేశాలు జారీచేశారు.

ఎస్సైపై దాడికేసులో వ్యక్తి అరెస్టు



దాడిఘటన వివరాలు వెల్లడిస్తున్న సీఐ, వెనుక ముసుగులో నిందితుడు

రాజాం సిటీ: సంతకవిటి ఎస్సైపై దాడిచేసి ఘటనలో నిందితుడిని అరెస్టు చేశామని రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 13న సంతకవిటి మండలం జావాం గ్రామదేవత పగడాలమ్మ జాతర నిర్వహించారు. ఈ జాతరలో మద్దూరుశంకరపేట, జావాం గ్రామాల యువకుల మధ్య కొట్లాట జరిగింది. ఈ కొట్లాటను నివారించే క్రమంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఆర్.గోపాలరావుపై మద్దూరుశంకరపేట గ్రామానికి చెందిన యడ్ల రమణ దాడిచేసి మెడలో రెండు తులాల బంగారు చైను తీసుకుపోయాడు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదుచేసి నిందితుడిని మద్దూరుశంకరపేట గ్రామంలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ చెప్పారు. సమావేశంలో ఎస్సై ఆర్.గోపాలరావు, హెచ్‌సీ ప్రసాదరావు, పీసీ కృష్ణ తదితరులు ఉన్నారు.

ఉరివేసుకుని విద్యార్థి ఆత్మహత్య

• విశాఖపట్నంలోని శ్రీ చైతన్య కళాశాలలో ఘటన



విద్యార్థి వేదాంత కార్తికేయ (ఫైల్)

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన తీడ వేదాంత కార్తికేయ (16) విశాఖపట్నంలోని శ్రీ చైతన్య కళాశాలలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థి ఆత్మహత్య ఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది. ఈనెల 7న విద్యార్థి కార్తికేయ ఇంటర్మీడియట్ విద్యాభ్యాసం కోసం విశాఖపట్నంలోని శ్రీచైతన్య కళాశాలలో జాయిన్ అయ్యాడు. ఈ క్రమంలో విద్యార్థి నాలుగు రోజులుగా అసౌకర్యంగా ఉండడంతో కళాశాల యాజమాన్యం నుంచి తల్లిదండ్రులకు సమాచారం అందింది. ఈ మేరకు తల్లిదండ్రులు అచ్యుతరావు, పార్వతి మంగళవారం కళాశాల హాస్టల్‌కు వెళ్లి విద్యార్థితో మాట్లాడారు. తరువాత విద్యార్థిని హాస్టల్‌లో ఉంచి ఇంటికి వెళ్లిపోయారు. మళ్లీ బుధవారం ఉదయం కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులకు ఫోన్ చేసి కార్తికేయ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం అందించగా తల్లిదండ్రులు కుమారుడి వద్దకు వెళ్లి కన్నీరుమున్నీరుగా విలపించారు.

అగ్ని ప్రమాదాల నివారణకు

అవగాహన అవసరం

• 14 నుంచి ప్రారంభమైన జాతీయ వారోత్సవాలు



పార్వతీపురం మండలం చినబొండపల్లిలో ఎల్‌పీజీ గ్యాస్ ద్వారా వచ్చే ప్రమాదాల నివారణకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురం రూరల్: ఇటీవల కాలంలో అగ్నిప్రమాదాలు తరచూ సంభవిస్తూనే ఉన్నాయి. అవగాహన లేక కొందరు, నిర్లక్ష్యం వహించి మరికొందరు ఈ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. ఈ నేపథ్యంలో అగ్నిమాపక శాఖ అధికారులు ప్రతి ఏడాది అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఏడాది 'అగ్ని సురక్ష దేశం కోసం- అందరం ఏకమవడం' అనే నినాదంతో వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా నాలుగు అగ్నిమాపక కేంద్రాలు

పార్వతీపురం జిల్లా కేంద్రం, గుమ్మలక్ష్మీపురం, సాలూరులో, పాలకొండలో అగ్నిమాపక కేంద్రాలున్నాయి.

ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు

వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున పలు జాగ్రత్తలు పాటిస్తే మేలని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు.

- అగ్గిపెట్టె లైటర్లు మండే పదార్థాలకు చిన్న పిల్లలను దూరంగా ఉంచాలి
- నాణ్యతా ప్రమాణాలు ఉన్న ఎలక్ట్రికల్ పరికరాలను మాత్రమే వినియోగించాలి
- సెలవులపై ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఇంటి మెయిన్ ఆఫ్ చేయడం సురక్షితం
- వంట గదిలో గాలి వెలుతురు ఉండేలా చూసుకోవాలి
- గ్యాస్ వాడకం పూర్తయిన తర్వాత సిలిండర్ వద్ద రెగ్యులర్ వాల్వ్‌ను నిలిపివేయాలి
- విద్యాసంస్థలు, ఆస్పత్రి, హోటల్‌లో అగ్నిప్రమాదాలు జరిగేటప్పుడు క్షేమంగా బయటపడేందుకు సరైన ప్రణాళికలను తయారుచేసి అవి అందరికీ అందుబాటులో ఉండే విధంగా చూడాలి

వారోత్సవాల్లో నిర్వహించే కార్యక్రమాలు

- 17న ఆస్పత్రిలోని సిబ్బందికి తరగతులు, మాక్ డ్రిల్ ప్రదర్శన
- 18న పరిశ్రమలు, పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాముల్లో అవగాహన తరగతులు
- 19న కల్యాణ మంటపాలు, విద్యాసంస్థల్లో ఫైర్ సేఫ్టీ తనిఖీలు
- 20 న రాజకీయ పార్టీ ప్రతినిధులతో అగ్నిమాపక కార్యాలయంలో ప్రమాదాల నివారణపై శిక్షణ తరగతుల సమావేశం.

సమయస్ఫూర్తితో జాగ్రత్తలు పాటించాలి



షాపింగ్ మాల్‌కు, అలాగే నూతన ప్రదేశాలకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అక్కడ గోడలపై అంటించిన ఫైర్ సేఫ్టీ మ్యాపులను చూడాలి. అగ్నిప్రమాదాల నివారణపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాలు జరిగిన చోటికి సమాచారం అందగానే క్షణాల్లోనే చేరుకునేలా సిబ్బంది అప్రమత్తంగా ఉంటున్నారు. అవసరమైన మేరకు సమీపంలో ఉన్న కేంద్రాల నుంచి కూడా అగ్నిమాపక వాహనాలను తెప్పిస్తున్నాం.

– కె. శ్రీనుబాబు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

చట్టాలపై స్పష్టమైన అవగాహన ఉండాలి

• ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



ఉత్తమ సేవలకు యాంత్రిక సురక్ష, ఉత్కృష్ట సేవా పతకాలు అందజేస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: పోలీస్ శాఖలో విధి నిర్వహణలో ఉన్న ప్రతి ఒక్కరికీ చట్టాలపై స్పష్టమైన అవగాహన ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం అయన జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో పోలీస్ కాన్ఫరెన్సు హాల్‌లో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించి పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, 174 సీఆర్‌పీఎస్ కేసులు, మిస్సింగ్, చీటింగ్ కేసులు, సైబర్ నేరాలు, ఇతర కేసులపై సమీక్షించారు. పోలీస్‌స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని ఎస్పీ ఈ సందర్భంగా ఆదేశించారు.

కళాశాలలో ర్యాగింగ్ లేకుండా అవగాహన కల్పించాలి

ఈ నేర సమీక్ష సమావేశంలో ఐజీ కేవీ మోహన్ రావు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ..జిల్లా పరిధిలో ఉన్న కాలేజీల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, మహిళా సంబంధిత నేరాలపై ప్రత్యేక శ్రద్ధతో దర్యాప్తు జరపాలని సూచించారు. పార్వతీపురం మన్యం జిల్లా ప్రాంతం ఒడిశా సరిహద్దులో ఉండడం వల్ల రాష్ట్రానికి ఎక్కువ మొత్తంలో గంజాయి అక్కడినుంచి వస్తున్నందున రైల్వే, ఆర్పీఎఫ్ ఫోర్స్‌తో సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని ఐజీ ఆదేశించారు.

ప్రతిభకు పురస్కారం

విధి నిర్వహణలో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను ఎస్పీ అందజేసి అభినందించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం 2022, 2023వ సంవత్సరంలో విధి నిర్వహణలో ఉత్తమసేవలు అందించిన వారికి గుర్తింపుగా అందజేసిన యాంత్రిక సురక్ష, ఉత్కృష్ట సేవా పతకాలను సిబ్బందికి ఎస్పీ అందజేశారు. సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, సీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దాయికి ఆరు నెలల జైలుశిక్ష

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలో జరిగిన దొంగతనాల కేసులో చీపురుపల్లి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు సివిల్‌జడ్జి వై.ప్రేమలత ముద్దాయికి ఆరునెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై బి.లోకేశ్వరరావు తెలిపారు. గరివిడి పోలీస్‌స్టేషన్ పరిధిలో గల దుమ్మెద, వెదుళ్లవలస,కొండలక్ష్మీపురం గ్రామాల్లో 2019లో దొంగతనాలు జరిగాయి. ఈ సంఘటనలపై అప్పుడే కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో బుధవారం కోర్టులో విచారణ జరపగా నేరం రుజువు కావడంతో ముద్దాయి పున్నాన రాంబాబుకు ఆరు నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వివరించారు.

హుషారుగా ఏనుగుల గుంపు



బిల్లుమడ సమీపంలో షికారు కొడుతున్న ఏనుగుల జంటలు

భామిని: మండలంలోని బిల్లుమడ సమీపంలో గల జీడితోటల్లో బుదవారం ఏనుగుల గుంపు హుషారుగా దర్శనమిచ్చింది. రెండు రోజుల క్రితం సింగిడికి చెందిన పింటూ సాంత్రో ఆరటి గెలను ఏనుగులకు అందివ్వబోయి కిందపడి రభస జరిగిన అనంతరం అటవీశాఖాధికారులు ఆందోళన చెందారు. పాలకొండ ఫారెస్ట్ రేంజర్ వచ్చి పరిస్థితి సమీక్షించి ఏనుగులను రెచ్చగొట్టవద్దని ప్రజలకు చేసిన సూచనల మేరకు చూపరులు దూరమయ్యారు. ఈ క్రమంలో ఏనుగులు హుషారుగా యథావిధిగా తిరుగుతూ కనిపించాయి.

ఒకేసారి మూడు బ్యాంకు ఉద్యోగాలు



మూడు బ్యాంకు కొలువులు సాధించిన చూడామణి

రేగిడి: ప్రస్తుతకాలంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే చాలా కష్టపడాల్సిందే. ఈ కష్టానికి తోడు అదృష్టం కలిసిరావాలి. అప్పుడే ప్రభుత్వ కొలువైనా..ప్రైవేట్ ఉద్యోగమైనా లభిస్తుంది. అటువంటిది రేగిడి మండలంలోని ఓ యువకుడిని ఒకే దఫా మూడు బ్యాంకు ఉద్యోగాలు వరించాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొండవలస గ్రామానికి చెందిన బెవర చూడామణి ఒకే ప్రయత్నంలో మూడు బ్యాంకు ఉద్యోగాలు సాధించాడు. లోకల్ యూనియన్ బ్యాంకులో ఎల్‌బీఓగా, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్రగా ప్రొబేషనరీ ఆఫీసర్‌గా, తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆఫీస్ అసిస్టెంట్/క్యాషియర్‌గా ఉద్యోగాలు సాధించాడు. డిగ్రీ అనంతరం మూడు సంవత్సరాలు విజయవాడలో బ్యాంకు ఉద్యోగాల నిమిత్తం చూడామణి కోచింగ్ తీసుకుంటున్నాడు. చివరికి తన ప్రయత్నం ఫలించి, మూడు ఉద్యోగాలు సాధించి లక్ష్యాన్ని చేరుకున్నాడు. ఆయన తండ్రి బెవర గోపాలకృష్ణ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, తల్లి గౌరీశ్వరి గృహిణి. కొద్దిపాటి వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఈ సందర్భంగా చూడామణి మాట్లాడుతూ తన తల్లిదండ్రుల కష్టంతో పాటు రాజాంలోని ఎస్ఎల్‌టీఎస్ కళాశాల ప్రిన్సిపాల్, తన పినతండ్రి ఉదయ్‌భాస్కర్ రాజా ప్రోత్సాహంతో తాను ఈ కొలువులు సాధించానని వెల్లడించాడు.

పలు రైళ్లు రద్దు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం-సీతానగరం రైల్వే స్టేషన్ల మధ్య ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా రైల్వే ఉన్నతాధికారులు పలు రైళ్ల రాకపోకలను రద్దు చేసినట్లు స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ-కొరాపుట్ పాసింజర్, విశాఖ రాయపూర్ పాసింజర్, విశాఖ-కొరాపుట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లను ఏప్రిల్ 22 నుంచి మే 5 వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 'విజయనగరం వరకే గుంటూరు -రాయగడ ఎక్స్‌ప్రెస్ గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 21 నుంచి మే 3 వరకు గుంటూరులో బయల్దేరి విశాఖ మీదుగా విజయనగరం వరకు వస్తుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో రాయగడకు బదులు విజయనగరం నుంచి బయలుదేరి విశాఖ మీదుగా గుంటూరు వెళ్తుందని ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

మొక్కజొన్నను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

• రైతుల డిమాండ్



లక్ష్మీపురంలో కళ్లంలో జొన్నగింజలు ఆరబెట్టిన రైతులు

సీతానగరం: రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలులో పారదర్శకంగా అండగా ఉంటామని ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం, దళారులను ప్రోత్సహించడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. సీతానగరం మండలంలో నీటివనరులుండి ఖరీఫ్ వరి పంట కోసిన మాగాణీ భూములు వందలాది ఎకరాల విస్తీర్ణంలో రైతులు మొక్కజొన్న సాగుచేశారు. ఈ ప్రాంతంలో రైతులు వాణిజ్యపంటగా మొక్కజొన్నను ఎంపిక చేసుకున్నారు. చక్కెర కర్మాగారం మూతపడడంతో చెరకు సాగు చేయాల్సిన భూముల్లో మొక్కజొన్న, పామాయిల్ తోటలను సాగు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం మొక్క జొన్న పంట కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, లేదా గత ప్రభుత్వం మక్కువలో ఏర్పాటు చేసిన జొన్నపంట కొనుగోలు కేంద్రాన్ని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయడం లేదని వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో దళారులు ఇదే అదనుగా వారికి నచ్చిన ధరకు పంట ఇవ్వాలని లేదంటే మీ ఇష్టమని అనడంతో పండించిన పంట ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నా మని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జొన్నపంటంతా పొలాల్లో నూర్పిడిచేసి తేమ నివారించడానికి ఆరబెట్టే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

జొన్నపంట కొనుగోలుకు ఉత్తర్వులు రావాలి

మొక్కజొన్న గింజలు కొనుగోలు చేయాలన్న మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి ఇంతవరకూ ఇంతవరకూ రాలేదు. జిల్లాలో రైతులు పండించిన మొక్కజొన్నపంట కూడిక పనులు జరుగుతున్నాయి. జొన్నలు కొనుగోలు చేయాలని ఆదేశాలు వచ్చిన వెంటనే కొనుగోలు చేయనున్నాం. – విమల, మార్క్‌ఫెడ్ మేనేజర్

ఈదురుగాలులకు నేలకొరిగిన వృక్షం



నేలకొరిగిన చెట్టు

పార్వతీపురంటౌన్: పట్టణంలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులకు కలెక్టరేట్ సమీపంలో ప్రకాశం క్లబ్-విశ్వవిజ్ఞాన విద్యాలయం మధ్యలో రోడ్డుపై చెట్టు విరిగిపడింది. దీంతో ఆ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పట్టణంలో కురిసిన వర్షానికి పలు వార్డుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

• మృతుడి భార్యకు తీవ్రగాయాలు



రాములప్పడు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

డెంకాడ: మండలంలోని చొల్లంగిపేట జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని ఎన్‌జీఆర్ పురం గ్రామానికి చెందిన జిగిలి రాములప్పడు(54) అక్కడికక్కడే మృతి చెందగా మృతుడి భార్య మహలక్ష్మి తీవ్ర గాయాలపాలైంది. దీనిపై ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాములప్పడు, భార్య మహలక్ష్మి తమ కుమార్తె వివాహ విషయమై మాట్లాడేందుకు విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలోని గంగచోళ్లపెంట గ్రామానికి వెళ్తున్నారు. కుమిలి-విజయనగరం రోడ్డులోని చొల్లంగిపేట జంక్షన్‌కు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోతిలో పడిపోయింది. దీంతో బైక్ నడుపుతున్న రాములప్పడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, బైక్ వెనుక కూర్చున్న మహలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం విజయనగరం తరలించారు. మృతుడి సోదరుడు జిగిరి రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సన్యాసినాయుడు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత..



మృతి చెందిన కొండమ్మ

గరుగుబిల్లి: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనికి సంబంధించి హెచ్‌సీ ఈశ్వరరావు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా రాజాం పట్టణానికి చెందిన సవలాపురపు సంజీవ్, భార్య కొండమ్మ పార్వతీపురం మండలంలోని గోపాలపురంలో చింతాడ కామేశ్వరి (కొండమ్మ చెల్లి) పెళ్లిరోజు వేడుకలకు హాజరై 15న సాయంత్రం ద్విచక్రవాహనంపై గోపాలపురంనుంచి స్వగ్రామం రాజాం వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో గరుగుబిల్లి మండలంలోని రావివలస జంక్షన్ సమీపంలో వెనుక కూర్చున్న కొండమ్మ ప్రమాదవశాత్తు బైక్‌నుంచి జారిపడగా తలకు బలమైన గాయమైంది. దీంతో మెరుగైన చికిత్సకోసం విజయనగరం తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. ఈ మేరకు మృతురాలు కొండమ్మ, తండ్రి రేజేటి పైడిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

ఏఆర్ కానిస్టేబుల్ పేరిట వాలీబాల్ టోర్నమెంట్

• ప్రారంభించిన ఏఎస్పీ



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఏఎస్పీ సౌమ్యలతతో పాటు ఏఆర్ అడ్మిన్ గోపాలరావు

విజయనగరం క్రైమ్: స్థానిక పోలీస్ బ్యారెక్స్‌లో ఏఆర్ కానిస్టేబుల్ పేరిట వాలీబాల్ టోర్నమెంట్ బుధవారం ప్రారంభమైంది.ఈ పోటీలను ఏఎస్పీ సౌమ్యలత ప్రారంభించారు. ఇటీవలే ఏఆర్ విభాగానికి చెందిన సీహెచ్.గోపాలరావు అనారోగ్యంతో మృతి చెందగా ఆయన స్మారకార్థం ఏఆర్ సిబ్బంది, లా అండ్ ఆర్డర్ సిబ్బంది వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిద్దామని పోలీస్‌శాఖ అడ్మిన్ ముందుంచారు. ఏఎస్పీ అనుమతితో పరేడ్ మైదానంలో వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు అన్ని పోలీస్‌స్టేషన్ల నుంచి లా అండ్ ఆర్డర్, ఏఆర్‌కు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. పోటీలను ప్రారంభించిన ఏఎస్పీ సౌమ్యలత మాట్లాడుతూ గోపాల్ రావును స్మరించుకుంటూ తోటి సిబ్బంది ఈ పోటీలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్‌లో విజయనగరం, గంట్యాడ, కొత్తవలస, బలిజిపేటకు చెందిన టీమ్‌లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.12 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.8 వేలు, తృతీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.6 వేలు, కన్సొలేషన్ ప్రైజ్‌కు రూ.4 వేల నగదును బహుమతిగా ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, ఎస్బీ సీఐలు లీలారావు, చౌదరి, ఆర్‌ఐలు గోపాల్‌రావు, శ్రీనివాసరావు, ఆర్ఎస్సైలు సూర్యనారాయణ, రామారావు, ముబారక్ ఆలీ, దివంగత కానిస్టేబుల్ సతీమణి శారద పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ కేసులో ఏబీసీడీ అవార్డు

• డీజీపీ చేతుల మీదుగా అందుకున్న వన్‌టౌన్ సీఐ



డీజీపీ హరీకుమార్ గుప్తా చేతుల మీదుగా అవార్డును అందుకున్న విజయనగరం వన్ టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రసన్న కుమార్, పీసీ రామరాజు, చిత్రంలో ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: విజయనగరం పోలీస్ సబ్ డివిజన్ పరిధి విజయనగరం వన్‌టౌన్ స్టేషన్ సీఐగా ఎనిమిది నెలల క్రితం చార్జ్ తీసుకున్న శ్రీనివాస్ ముంబై, పుణెలకు వెళ్లి మరీ నిందితులను పట్టుకున్నందుకు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా మంగళగిరిలో బుదవారం అవార్డ్ ఫర్ బెస్ట్ ఇన్ క్రైమ్ డిటెక్షన్‌ను అందుకున్నారు. వివిధ పోలీస్‌స్టేషన్‌లలో ప్రతి మూడు నెలలకోసారి పలు కేసుల ఛేదనలో స్థానిక స్టేషన్‌హౌస్ ఆఫీసర్లు చూపిన ప్రతిభను డీజీపీ ఆఫీస్ పరిశీలనలోకి తీసుకుంటుంది. అందులో భాగంగా గతేడాది దాదాపు కోటిన్నర పైగా డబ్బులు పోయాయని వన్‌టౌన్ పోలీసులు ఫిర్యాదు అందుకున్నారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో అప్పుడే విజయనగరం వన్‌టౌన్ పోలీసులు డిజిటల్ అరెస్ట్‌గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ కేసులో విజయనగరం వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్సై లక్ష్మీ ప్రసన్నకుమార్‌లు జమ్ము, ముంబై, పుణె ప్రాంతాల్లో ఉండి మరీ ఐదుగురు నిందితులను పట్టుకున్నారు. ఈ క్రమంలోనే ఏబీసీడీ అవార్డు పరిశీలనలోకి వెళ్లారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయం పరిశీలనలో విజయనగరం వన్‌టౌన్ సీఐ, ఎస్ఐల పేర్లు రావడం, మంగళగిరి నుంచి పిలుపు రావడంతో ఎస్పీ వకుల్ జిందల్‌తో కలిసి వెళ్లి వారు ఈ అవార్డును అందుకున్నారు.

ఉద్రిక్తతల నడుమ పామాయిల్ మొక్కల తొలగింపు



దేవాదాయ శాఖ అధికారులు రక్షణ కవచంలా నిలబడి అర్చక కుటుంబీకులను అడ్డుకుంటున్న దృశ్యం

సంతకవిటి: మండలంలోని సిరిపురం గ్రామంలో కొండపై వెలసిన కొండకామేశ్వర స్వామి ఆలయం ఇటీవల దేవాదాయ శాఖ ఆధీనంలోకి వచ్చింది. ఈ ఆలయానికి సంబంధించి సర్వే నంబర్ 84లో 2.70 ఎకరాల భూమి ఉంది. ఈ పొలాన్ని కౌలుకు ఇచ్చేందుకు అధికారులు ముందుకు రావడంతో ఆలయ అర్చకుడు అడ్డుపడగా రెండు పర్యాయాలు వాయిదా పడింది. పొలంలోని పామాయిల్ మొక్కలు తొలగిస్తేనే కౌలుకు తీసుకునేందుకు ముందుకు వస్తామని సిరిపురం గ్రామ ప్రజలు పట్టుబట్టడంతో విజయనగరం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీష బుధవారం గ్రామానికి చేరుకుని జేసీబీ సహాయంతో మొక్కలను తొలగించారు. జేసీబీ పొలంలో దిగుతున్న సమయంలో, మొక్కలు తొలగిస్తున్న సమయంలో అర్చకుల కుటుంసభ్యులు పదేపదే జేసీబీకి అడ్డుతగిలారు. ఈ క్రమంలో అధికారులే రక్షణ కవచంలా నిలబడి వారిని నిలువరించారు. పోలీసులకు ముందస్తు సమాచారం అందించినా ఎవరూ కనీసం రాలేదని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీష వాపోయారు. పని పూర్తి కావస్తున్న సమయంలో కేవలం ఇద్దరు పోలీసులు రావడం విశేషం. కార్యక్రమంలో ఈఓ బి.వి.మాధవరావు, రాజాం నవదుర్గ దేవాలయం ఈఓ పి.శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్స్ కోర్సులకు డిమాండ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ సంజయ్ ధర్వేకర్

నెల్లిమర్ల రూరల్: రానున్న కాలంలో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్, ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన కోర్సులకు మంచి డిమాండ్ ఉందని గాయత్రి విద్యా పరిషత్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ ధర్వేకర్ అన్నారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో రోబోతాన్ 2కె25 కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న రంగంలో పూర్తి పట్టు సాధిస్తే భవిష్యత్తులో మంచి ఫలితాలు ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థుల ప్రాజెక్టుల మూల్యాంకనం చేసి బాగున్నాయని కితాబిచ్చారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, ప్రొఫెసర్ దీపక్ కుమార్, సన్నీ డియోల్, పీఎస్వీ రమణారావు, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240